సాక్షి
నిర్మల్
ఆదివారం ၊ 18 ၊ ఆగస్టు ၊ 2024

ఏఈఓల బదిలీలు

నిర్మల్ రూరల్: జిల్లాలో వ్యవసాయ విస్తరణ అధికారుల బదిలీలు జరిగాయి. నిర్మల్ రూరల్ మండలంలోని చిట్యాల క్లస్టర్ నూతన ఏఈవోగా జాదవ్ అంబాజీ, మేడిపల్లి క్లస్టర్ ఏఈవో గా సంకీర్తన, అక్కాపూర్ ఏఈవోగా రజని శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పని చేసిన హర్షిత కుంటాల మండలానికి, శ్రావ్య దిలవార్‌పూర్, రాకేశ్ భైంసా మండలానికి బదిలీ అయ్యారు.

ఎస్పీని కలిసిన నూతన ఎస్సైలు

నిర్మల్‌టౌన్: నూతనంగా బాధ్యతలు చేపట్టిన లోకేశ్వర్ ఎస్సైగా అశోక్, భైంసా రూరల్ ఎస్సై శ్రీనివాస్ ఎస్పీ జానకీ షర్మిలను శనివారం పోలీస్ ప్రధాన కార్యాలయంలో కలిశారు. విధుల్లో చేరిన అనంతరం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్క అందజేశారు. విధులు బాధ్యతగా నిర్వర్తించాలని ఎస్పీ సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.6 /25.5

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న యువకులు

దిలావర్‌పూర్: దిలావర్‌పూర్ శివారులో పంట చేల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని తరలించాలని మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రతీ శుక్రవారం నిర్వహించే ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి అధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, ఐఏఎస్ దివ్యాదేవరాజన్‌కు వినతిపత్రం అందజేసి తమ సమస్యను వారిదృష్టికి తీసుకెళ్లారు. ఈసందర్భంగా ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ పచ్చని పంటచేల నడుమ ఫ్యాక్టరీని స్థాపిస్తే వ్యవసాయానికి ఇబ్బందులు తలెత్తడమే కాకుండా వాతావరణ కాలుష్యం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న గోదావరి సైతం కలుషితం అవుతుందని తెలిపారు. తమ వినతిపై అధికారులు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసి సమస్య విన్నవించారు.

20న సదరం శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మీసేవ ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకుని వెయిటింగ్ లిస్టులో ఉన్న శారీరక అంగవైకల్యం ఉన్నవారికి జనరల్ ఆసుపత్రిలో ఈ నెల 20న సదరం శిబిరం నిర్వహిస్తామని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి తెలిపారు. మొబైల్‌కు సమాచారం అందినవారు మాత్రమే 20వ తేదీ ఉదయం 9 గంటల లోపు హాజరు కావాలని సూచించారు.

20న ఇంటర్వ్యూలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న 57 వైద్యాధికారుల నియామకాలకు ఈనెల 20న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. 2 సీఏఎస్, 6 ప్రొఫెసర్, 14 అసోసియేట్ ప్రొఫెసర్, 18 అసిస్టెంట్ ప్రొఫెసర్, 17 సీనియర్ రెసిడెంట్ పోస్టులకు హనరోరియం పద్ధతిన నియమించడం జరుగుతుందని వివరించారు. అర్హత ఆసక్తి ఉన్నవారు స్థానిక మెడికల్ కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు.

అంబేద్కర్ విదేశీ విద్యానిధికి దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్‌చైన్‌గేట్: విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులు అంబేద్కర్ విదేశీ విద్యా నిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వి.రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. అమెరికా, ఇంగ్లాండ్, స్విట్జర్లాండ్, కెనడా, న్యూజిలాండ్, సింగపూర్, సౌత్ కొరియా దేశాలు వెళ్లేవారికి ఈ పథంక వర్తిస్తుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు అక్టోబర్ 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

23న పెన్షన్ విద్రోహ దినం



మాట్లాడుతున్న కృష్ణారావు

కుంటాల: ఈనెల 23న తెలంగాణ రాష్ట్ర పెన్షన్ విద్రోహ నిర్వహించనున్నట్లు సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.కృష్ణారావు తెలిపారు. కుంటాల ఆదర్శ పాఠశాలలో శనివారం మాట్లాడారు. ఆగస్టు 23న కేంద్ర ప్రభుత్వ లేఖకు సమాధానమిస్తూ తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ సెప్టెంబర్ 1 వరకు మీట్ అవర్ ఎమ్మెల్యే ఎంపీ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు, మంత్రులకు పాత పెన్షన్‌విధానం పునరుద్ధరించాలని కోరారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి భూమన్న, నాయకులు తిరుపతిగౌడ్, లక్ష్మణ్, తిరుపతిరెడ్డి, జ్యోతి, సుధారాణి పాల్గొన్నారు.

బల్దియాలో హెల్ప్ డెస్క్

నిర్మల్‌టౌన్: రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో నిర్మల్ మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేశామని మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు తెలిపారు. ఆపదలో ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 7036661070 కు ఫోన్ చేసి సహాయం పొందాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డిజాస్టర్ రాపిడ్ ఫోర్స్ కింద 6 హెల్త్ ఆఫీసర్లను, జేసీబీ ఆపరేటర్, కంట్రోల్ రూమ్ ఆపరేటర్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. వరద రోడ్లపైకి రాకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించినట్లు చెప్పారు.

కొడుకు.. ఏమైనా చేయొచ్చా..?

మాకు స్వేచ్ఛ లేదా...!?



'నిర్భయ, అభయ, కోల్‌కతాలో డాక్టర్ ఇలా.. ఎంతమంది అమ్మాయిలు నిండు జీవితాలను కోల్పోవాలి. కోల్‌కతా ఘటన నేపథ్యంలో నేను అందరినీ కొన్ని ప్రశ్నలు అడగదలుచుకున్నాను. ఆడపిల్ల బయటకు వెళ్తే.. ఫోన్లో లైవ్‌లొకేషన్ ఆన్‌చేసుకోవాలి. మేమెక్కడ ఉన్నామో.. ఎలా ఉన్నామో.. ఎప్పటికప్పుడు ఫోన్‌లో చెప్పాలి. మేము ఏం చదవాలో.. ఏ డ్రెస్ వేసుకోవాలో.. ఎలా ఉండాలో కూడా మేము నిర్ణయించుకోవద్దు. ఎందుకిలా..!? దేశంలో అర్ధరాత్రి ఆడవాళ్లు నిర్భయంగా, ఒంటరిగా తిరిగినప్పుడే అసలైన స్వాతంత్య్రం వచ్చినట్లు అని గాంధీజీ చెప్పారు. మొన్ననే 78వ స్వాతంత్య్ర దినోత్సవం జరుపుకున్నాం. అయినా ఇప్పటికీ ఆడవాళ్లం పట్టపగలే స్వేచ్ఛగా తిరగలేకపోతున్నాం. మాకు ఇంకా ఎప్పుడు స్వేచ్ఛ వస్తుందో సమాధానం చెప్పాలి..' అంటూ బీటెక్ చేస్తున్న అనన్య సూటిగా ప్రశ్నించింది. జిల్లా కేంద్రంలో శనివారం ఐఎంఏ చేపట్టిన నిరసనకు మద్దతు తెలిపేందుకు వచ్చిన అనన్య మాట్లాడిన మాటలు అక్కడున్న వారందరినీ ఆలోచింపజేశాయి.

- ఆడపిల్లలకే ఆంక్షలు..అడుగడుగునా జాగ్రత్తలా..!?
- అబ్బాయిలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అంతంతే..
- మగపిల్లలకు మంచీచెడులు చెప్పరా..?
- కోల్‌కతా వంటి ఘటనలకు బాధ్యులెవరు..?
- ప్రశ్నిస్తున్న ఆడబిడ్డలు, సభ్యసమాజం
- అతిగారాబం వద్దంటున్న నిపుణులు


కోల్‌కత్తా ఘటనను నిరసిస్తూ నిర్మల్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, మద్దతుగా పాల్గొన్న విద్యార్థులు, మెడికల్ రిప్రజెంటేటివ్‌లు, స్వచ్ఛంద సంఘాల సభ్యులు

నిర్మల్: 'ఏయ్.. ఈ టైమ్ దాకా ఎక్కడికి వెళ్లావే. నీ కాలేజీ నాలుగింటికే అయిపోతుంది కదా..! ఏడింటి దాకా ఏం చేశావ్..?' అంటూ వంటగదిలో నుంచే అమ్మ గద్దిస్తుంటే.. 'ఏంటమ్మ.. నీకెన్నిసార్లు చెప్పాను. నీకేదైనా అవసరం ఉంటే నాకు చెప్పొచ్చు కదా..! నేను తీసుకు వస్తాను కదమ్మా. నువ్వేందుకు అటుఇటు బయట తిరగడం. ముందే బయట వాతావరణం బాగాలేదు..' అంటూ నాన్న చెబుతుంటే.. 'ఆడపిల్లగా పుట్టడమే తాము చేసిన తప్పా..!? తమకు ఇన్ని జాగ్రత్తలు చెప్పే అమ్మానాన్నలు అదే అన్నకో, తమ్ముడికో ఏ ఒక్కరోజు కూడా ఎక్కడికి వెళ్లావురా? ఏంచేస్తున్నావురా..? అని ఎందుకు అడగరు. వాళ్లేం చేసినా ఎందుకు వెనకేసుకొస్తారు. మగాడైతే ఏదైనా చేయొచ్చా..?' అని ఆడబిడ్డ మనసులోనే ప్రశ్నించుకుంటోంది. నిర్భయ, అభయ, కోల్‌కతా డాక్టర్‌లపై అఘాయిత్యాలకు పాల్పడింది మృగాళ్లుగా మారిన మగాళ్లే అని సమాజం ఎందుకు ఆలోచించడం లేదు. తమ బిడ్డకు పది ప్రశ్నలు వేసే తల్లిదండ్రులు తమ కొడుకులు ఏం చేస్తున్నారోనని ఒక్క ప్రశ్న కూడా ఎందుకు అడగటం లేదు. చిన్నప్పటి నుంచి మగాడన్న గారాబమే చాలామంది యువతను తప్పుదోవ పట్టిస్తోందని మానసిక నిపుణులూ చెబుతున్నారు.

మగపిల్లలకు చెప్పడం లేదు..

ఏది గుడ్‌టచ్, ఏది బ్యాడ్ టచ్ అని.. ఆడపిల్లలకు చెప్పే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మగపిల్లలకు ఇలా చేయొద్దు.. అని చెప్పడం లేదు. బిడ్డలను కూర్చోబెట్టుకుని సవాలక్ష జాగ్రత్తలు చెప్పినట్లు, కనీసం ఒక్కరోజూ కొడుకుతో మాట్లాడిన సందర్భాలు కనిపించడం లేదు. చాలా కుటుంబాలు ఆడపిల్లలను ఒకలా, మగపిల్లలను మరోలా పెంచుతున్నారు. 'వాడు మగపిల్లాడు.. ఎట్లుంటే ఏమైతది..' అని నాన్నమ్మతాతలు మొదలు అమ్మనాన్నల దాకా అందరూ లైట్‌గా తీసుకుంటున్నారు. చిన్న చిన్న తప్పులు చేసినా వెనకేసుకొస్తున్నారు. అసలు మగపిల్లలు ఏం చేస్తున్నారన్న ప్రశ్నే చాలా ఇళ్లల్లో తల్లిదండ్రులు వేయడం లేదు. ఇదే చాలామంది పిల్లలు తప్పుదోవ పట్టడానికి కారణమవుతోంది.

వ్యసనాలతో మొదలు..

ఇంటాబయట అడిగేవారు లేకపోవడంతో చాలా మంది అబ్బాయిలు హైస్కూల్ వయసులోనే చెడు వ్యసనాలకు లోనవుతున్నారు. టీనేజ్‌లో వచ్చే శారీరక, మానసిక మార్పుల విషయాలనూ తల్లిదండ్రులు చెప్పకపోవడం, కనీసం పాఠ్యాంశాల్లోనూ ఉపాధ్యాయులు సరిగా వివరించకపోవడంతో.. మిడిమిడి జ్ఞానంతో ఎవరో చెప్పే విషయాలకు ఆకర్షితులై వక్రమార్గం పడుతున్నారు. తల్లిదండ్రులకు తెలియకుండా సిగరెట్లు, మద్యం తాగుతున్నారు. ఇటీవల జిల్లాలో కొన్ని గంజాయి కేసుల్లో టీనేజ్‌తో పాటు హైస్కూల్ విద్యార్థులూ సేవిస్తున్నట్లు తేలడం ఆందోళన కలిగిస్తోంది. గంజాయి వంటి డ్రగ్స్ కు అలవాటైన తర్వాత మానసికంగా మరింతగా బ్యాలెన్స్ కోల్పోవడం, విపరీత ధోరణులకు పాల్పడటం చేస్తుంటారని మానసిక నిపుణులు చెబుతున్నారు. వ్యసనాల కోసం కావాల్సిన డబ్బులను ఇంట్లో నుంచి దొంగతనం చేస్తున్నారు. చైన్‌స్నాచింగ్ చేసేవారిలోనూ టీనేజర్స్ ఉంటున్నారు. వీరు జల్సాల కోసమే ఈ పనులు చేస్తున్నట్లు చెబుతుండటం శోచనీయం. అర్ధరాత్రి వరకూ సెల్‌ఫోన్‌ను పట్టుకునే పిల్లలు ఏంచూస్తున్నారో.. వారి ధోరణి ఎలా ఉందో.. కూడా తల్లిదండ్రులు గమనించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

మగ పిల్లలకూ చెప్పాలి..

సమాజంలో ఆడపిల్లలు, మగపిల్లలను వేరుగా చూసే భావనే చాలా ఘటనలకు కారణమవుతోంది. ఏది గుడ్‌టచ్, ఏది బ్యాడ్ టచ్ అని ఆడపిల్లలకు చెప్పినట్లు, మగపిల్లలకూ ఏది చేయొద్దు.. ఏం చేయాలని చెప్పాలి. తమకు తల్లి, చెల్లి, అక్క ఉన్నారనే భావన వారిలో కలిగించాలి.

– డాక్టర్ విశాల్ ఆకుల, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ

చిన్నవయసులోనే..

జిల్లాలో ఇటీవల గంజాయి, మత్తుపదార్థాలపై సీరియస్‌గా దృష్టిపెడుతున్నాం. కొన్ని కేసుల్లో చిన్నవయసులోనే కొందరు ఇలాంటి వ్యసనాల బారిన పడుతున్నట్లు కనిపిస్తుండటం బాధాకరం. ఆడపిల్లలకు జాగ్రత్తలు చెబుతున్నట్లే.. తమ మగపిల్లలూ ఏం చేస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు గమనించాలి. వారిని సరైన మార్గంలో వెళ్లేలా చూడాలి.

–జానకీషర్మిల, ఎస్పీ

పోడు సమస్య పరిష్కారానికి చర్యలు

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- మంత్రి సీతక్కతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పోడు భూముల సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కలెక్టర్లకు సూచించారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి సీతక్కతో కలిసి కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, అటవీ, గిరిజన సంక్షేమ శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల వారీగా పోడు భూముల పట్టాల కోసం ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులు తెలుసుకున్నారు. పోడు సమస్య పరిష్కారానికి ప్రత్యేక ఎజెండాను రూపొందించుకుని సాగుచేస్తున్న భూముల హద్దులు, అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. అనర్హులు అటవీ భూములను ఆక్రమించుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. అటవీ, గిరిజన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి పోడు భూముల సమస్యల పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ పోడు భూముల సమస్య పరిష్కరించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు పోడు పట్టాల కోసం మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులు, సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోడు భూములు సాగు చేస్తున్న గ్రామాలకు సంబంధించిన వివరాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీటీడీవో అంబాజీ, డీపీవో శ్రీనివాస్, అటవీశాఖ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యుడికి భరోసా కల్పించాలి

- బేసిక్ పోలీసింగ్‌పై శ్రద్ధ పెట్టాలి
- డయల్ 100ను పటిష్టం చేయాలి
- ఎస్పీ జానకీషర్మిల


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్‌టౌన్: సామాన్యుడిని దృష్టిలో పెట్టుకుని పోలీసులు విధులు నిర్వహించాలని, వారికి పోలీసు శాఖపై భరోసా కల్పించాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. మార్గదర్శకంగా ఉండాల్సిన పోలీసులు అనైతిక చర్యలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలతోపాటు, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయం నుంచి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కానిస్టేబుల్‌స్థాయి నుంచి ఏఎస్పీ స్థాయి అధికారుల వరకు శనివారం కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్ కేసుల్లో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ పెంపొందించి, దర్యాప్తును పూర్తి చేయాలని సూచించారు. డయల్ 100 పటిష్టం చేయాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీం నియమించాలని సూచించారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పండుగలు..

రాబోవు వినాయక చవితిని జిల్లా ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ముందస్తుగా అన్ని కమిటీలతో గణపతి విగ్రహం ప్రతిష్టాపన నుంచి నిమజ్జనం వరకు జరిగే కార్యక్రమాల భద్రత పరమైన చర్యలపై చర్చించాలని పోలీసులు సూచించారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రించాలని సూచించారు. అధికారులతో కలిసి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భూకబ్జాలు చేయడం, బెదిరించడం భూములను నకిలీ పత్రాలు సృష్టించి బలవంతపు వసూళ్లకు పాల్పడడం, తదితర అంశాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు.

గాంజ రవాణా అరికట్టాలి

జిల్లాలోకి రాష్ట్ర సరిహద్దుల నుంచి వచ్చే గంజాయి సరఫరా చేసే మూలాలను, కీలక వ్యక్తులను గుర్తించి, వారిపై కేసులు నమోదు చేసి అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. గుట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట, గుడుంబా, పీడీఎస్ బియ్యం రవాణాపై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్టు చేయాలని ఆదేశించారు. ఆయుధాల లైసెన్సుల జారీపై జాగ్రత్త వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు సంబంధించిన కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు.

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుని సమస్యలను సమర్థవంతంగా పరిష్కరిస్తే సంతృప్తి చెందుతారన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన..

ఫోన్ల ద్వారా ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో, పట్టణాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఓటీపీ ఫ్రాడ్ గురించి ఉదాహరణలు చూపించాలని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాడీ పట్టలేదు.. చికిత్స చేయలేదు

- కోల్‌కతా వైద్యురాలి ఘటనపై జిల్లా వైద్యుల నిరసన
- 24 గంటల వైద్యసేవల నిలిపివేత..
- ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- దోషులను శిక్షించాలని కలెక్టర్, ఎస్పీలకు వినతి

నిర్మల్‌ఖిల్లా: కోల్‌కత్తాలో వైద్యురాలిపై జరిగిన పాశవిక లైంగికదాడి, హత్యను నిరసిస్తూ ఐఎంఏ పిలుపు మేరకు జిల్లా వైద్యులు శనివారం విధులు బహిష్కరించారు. 24 గంటలు వైద్య సేవలు నిలిపివేశారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వైద్యులకు మద్దతుగా డ్రగ్స్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్, తెలంగాణ డయాగ్నోస్టిక్ అసోసియేషన్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్, జన విజ్ఞాన వేదిక, తెలంగాణ రచయితల వేదిక, జూనియర్ కళాశాలల అసోసియేషన్,వివిధ రకాల స్వచ్ఛంద సంస్థలు సామాజిక కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. నిర్మల్‌లో డాక్టర్స్ లేన్ నుంచి శివాజీ చౌక్ వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో వందలాదిమంది పాల్గొన్నారు. నిందితులను ఉరితీయాలని, మహిళా సంరక్షణ కోసం చట్టాలు, వ్యవస్థలు పకడ్బందీగా శిక్షలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దారి పొడవునా బాధితురాలికి మద్దతుగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు, ఎస్పీ జానకీషర్మిలకు వేర్వేరుగా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ... నిరసన కార్యక్రమంలో భాగంగా అన్ని హాస్పిటల్స్‌లో ఓపి సేవలు నిలిపివేసి బందు పాటించామన్నారు. రోగులకు కలిగిన అసౌకర్యానికి విచారం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం నుంచి వైద్య సేవలను కొనసాగిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ మురళీధర్, సీనియర్ వైద్యులు అప్పాల చక్రధారి, డాక్టర్ దామెర రాములు, డాక్టర్ ప్రమోద్‌చంద్రారెడ్డి, ఉప్పు కృష్ణంరాజు, రమేశ్, రజిని, చంద్రిక, యు.రామకృష్ణ దేవీదాస్, వెంకట్రావు, రమణగౌడ్, శ్రీకాంత్, బీఎల్ఎన్.రెడ్డి, జనవిజ్ఞాన వేదిక నాయకులు సుదర్శన్, తెలంగాణ డయాగ్నొస్టిక్ సంఘం అధ్యక్షుడు నేరెళ్ల హనుమంతు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ ప్రవీణ్, అజారుద్దీన్, శ్రీధర్, రాజు తదితరులు పాల్గొన్నారు.


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న వైద్యుల బృందం


బాసర ఆలయంలో పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలి


ఏఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బాసర: బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో పోలీస్ ఔట్‌పోస్టు లేదా ప్రత్యేక బెటాలియన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ముథోల్ నియోజకవర్గ నాయకులు కొమ్రేవార్ కిరణ్, విలాస్ గాదేవార్, మాజీ వైస్ ఎంపీపీ ఓని నర్సింగరావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ నూకం రామారావు, కొర్వ శ్యామ్, ఉమ్మాయి సంజీవరావు శనివారం ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాలుగు రోజుల క్రితం ఆలయంలో దొంగతనం జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం ఆలయ సీనియర్ అసిస్టెంట్ రాజేందర్‌ను అడిగి వివరాలను తెలుసుకున్నారు. బాసర ఆలయంలో దొంగతనం బాధాకరమన్నారు. ఆలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తరచూ ఏదో ఒక ఘటన జరుగుతోందన్నారు. దీంతో ఆలయ ప్రతిష్ట దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రత విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. ఎక్కువ మంది సిబ్బందిని ఆలయ భద్రతకు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం స్పందించి బాసర ఆలయ భద్రతకు ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆలయ ఈఈవో సుదర్శన్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ చేసి..

- అన్నం.. పప్పు రుచిచూసిన అదనపు కలెక్టర్
- కేంద్రం నిర్వహణ తీరుపై ఆగ్రహం
- టీచర్‌కు షోకాజ్ నోటీస్ జారీకి ఆదేశం


అన్నం రుచి చూస్తున్న అడిషనల్ కలెక్టర్

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందడంతో ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈమేరకు అదనపు కలెక్టర్ విద్యానగర్–1 కేంద్రాన్ని తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు, గైర్హాజరు, పోషకాహారం పంపిణీ వంటి విషయాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. 300 కోడి గుడ్లు తేడా ఉన్నట్లు గుర్తించారు. లబ్ధిదారులకు సరుకులను సక్రమంగా ఇవ్వకపోవడం, రికార్డుల్లో తప్పుగా నమోదు చేసినట్లు ధ్రువీకరించారు. ఈ విషయమై టీచర్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సీడీపీవో సరితను ఆదేశించారు. రికార్డుల్లో టీచర్‌కు మెమో జారీ చేసినట్లు ఉండడంతో ఈ విషయమై సీడీపీవోను అడిగి తెలుసుకున్నారు. సరుకుల్లో తేడా ఉండడంతో గతంలో మెమో జారీ చేసినట్లు సీడీపీవో అదనపు కలెక్టర్‌కు తెలిపారు. అంతకు ముందు అంగన్‌వాడీ కేంద్రంలోని మెనూ చార్ట్‌ను పరిశీలించారు. చిన్నారుల కోసం తయారు చేసిన అన్నం, పప్పును రుచి చూశారు. తనిఖీలు నిరంతరం కొనసాగేలా సీడీపీవో, సూపర్‌వైజర్లను ఆదేశిస్తామన్నారు. జర్నలిస్టులు సైతం సామాజిక బాధ్యతగా కేంద్రాలను తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంటిని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్‌చైర్మన్ కావలి సంతోష్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

రోగులకు సేవలందించాలి

సాక్షి ఎఫెక్ట్..


మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ సురేశ్

భైంసాటౌన్: వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటూ ఇబ్బందులు లేకుండా సేవలు అందించాలని డీసీహెచ్ఎస్ సురేశ్ అన్నారు. 'వైద్యులు 28 మంది.. విధుల్లో 8 మంది' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన భైంసా ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రి వైద్యులతో సమావేశం నిర్వహించారు. శుక్రవారం ఒకరోజు ఎక్కువ సంఖ్యలో వైద్యులు సెలవు ఎందుకు పెట్టారన్న విషయంపై విచారణ జరిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. ఓపీ వేళల్లో రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉండగా, ముగ్గురు వైద్యులను నర్సాపూర్‌కు డిప్యూటేషన్‌పై పంపడంపై వివరణ కోరారు. ఇద్దరు వైద్యులు లాంగ్‌లీవ్‌లో ఉండడంపై కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఓటరు నమోదుకు ఏర్పాట్లు

నిర్మల్‌చైన్‌గేట్: ఇంటింటి సర్వేలో భాగంగా ఓటర్ల వివరాలు పకడ్బందీగా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. ఇంటింటి సర్వే, ఓటర్ల వివరాల నమోదు, బీఎల్‌వోలకు శిక్షణ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఓటర్ల వివరాల నమోదుకు ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. సర్వేలో భాగంగా ప్రతీ ఇంటిని సందర్శించి, ఓటర్ల సంఖ్య, చిరునామా, ఫొటో, ఇతర వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. సర్వే నిర్వహించే సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలకు శిక్షణ తరగతులు నిర్వహించాలన్నారు. అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి సర్వే వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. అర్హులైన ప్రతీ పౌరుడు ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చూడాలని పేర్కొన్నారు. సమీక్ష అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. ఓటరు వివరాల నమోదుకు ఇంటింటి సర్వే నిర్వహించేందుకు సోమవారం నుంచి సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలకు రెండు రోజులు శిక్షణ ఇవ్వాలని సూచించారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లలో పొందుపరచాలన్నారు. మరణించిన, చిరునామా మారిన, ఇతర చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వివరాలను పరిశీలించాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్క రూ నూతనంగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. https://nvsp.in, https://voters.eci.gov.in వెబ్‌సైట్‌లలోనూ ఓటు హక్కు నమోదు, ఓటరు చిరునామా మార్పు వివరాలు తదితర సేవలను పొందవచ్చునని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, నిర్మల్, ముథోల్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య


దినేశ్ (ఫైల్)

తలమడుగు: మద్యానికి బానిసై ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లింగి గ్రామానికి చెందిన రాగి దినేశ్ (32)కు వివాహమై ఏడేళ్లయినా సంతానం కలగలేదు. రెండేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఏ పనీ చేయకుండా గ్రామంలో జులాయిగా తిరిగేవాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో ఈనెల 3న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుంటకల్‌లో యువకుడి మిస్సింగ్


దేవురావు (ఫైల్)

తాంసి: భీంపూర్ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఒకరు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుంటకల్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయాడు. చింతపల్లి గ్రామానికి చెందిన కుమ్ర దేవురావు (29) ఈ నెల 12వ తేదీన తిరుపతికి దైవదర్శనం కోసం బంధువులతో వెళ్లాడు. దర్శనం అనంతరం ఈనెల 15న తిరిగి వస్తున్న క్రమంలో గుంటకల్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ సోదరుడు మిస్సింగ్ అయినట్లు భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో భీంరావు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కలీం తెలిపారు. దేవురావు ఆచూకీ తెలిస్తే 9959272153, 7729029944 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


బాలాజీ (ఫైల్)

భైంసారూరల్: మండలంలోని మహాగాం గ్రామానికి చెందిన కదం బాలాజీ (48) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీనివాస్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలాజీ కొంత కాలంగా మద్యానికి అలవాటుపడ్డాడు. ఏ పనీ చేయకుండా నిత్యం తిరిగేవాడు. శనివారం ఎప్పటిలాగే ఇంటి నుంచి వెళ్లిన బాలాజీ మద్యం మత్తులో గ్రామ సమీపంలోని పంట పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భైంసా ఏరియా స్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

‘కడెం’కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం ప్రాజెక్టులోకి 2,539 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఒక వరద గేటు ద్వార 4,009 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ)అడుగులు కాగా, ప్రస్తుతం 698.625(7.245టీఎంసీ) అడుగులు ఉంది.

బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దు

కుంటాల: బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దని చైల్డ్ హెల్ప్ లైన్ కౌన్సిలర్ సుప్రియ అన్నారు. శనివారం కుంటాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు బాలల హక్కుల పై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగనాథ్, జేఎల్.గంగయ్య, సిబ్బంది సగ్గం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

బాసరలో భద్రత అంతంతే..

- ఆలయం, మండలానికి ఒకే ఠాణా
- ప్రధాన గుడిలో ఇన్‌చార్జీల పాలన
- వేడుకలప్పుడే బలగాల మోహరింపు
- బందోబస్తులో 28మంది హోంగార్డులే
- సీసీ కెమెరాలున్నా పర్యవేక్షణ కరువు


బాసర ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో భద్రత అంతంతే. ప్రధాన ఆలయం అయినప్పటికీ ప్రత్యేక బందోబస్తు చర్యలు కల్పించడంలేదు. ఏటా నిర్వహించే ఉత్సవాలు, ముఖ్య పర్వదినాల్లోనే ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. అమ్మవారి ఆలయానికి జడ్జిలు, ప్రముఖులు, మంత్రులు, ఉన్నతాధికారులు దర్శనానికి వచ్చిన సమయంలోనే పోలీసు బలగాలు కనిపిస్తాయి. ప్రధాన వ్యక్తులు బాసరకు వస్తున్నారని సమాచారం రాగానే కొద్ది గంటల ముందు బందోబస్తు చేపడతారు. ఆలయంలో మంత్రుల పర్యటన ఉన్నపుడు, ఉన్నతస్థాయి అధికారులు వచ్చినపుడే ప్రత్యేక పోలీసులు కనిపిస్తుంటారు. ఇక ఉత్సవాల్లో పాల్గొనే పోలీస్ బలగాలు ముగిసిన వెంటనే వెనుదిరిగి వెళ్లిపోతాయి.

ఇన్‌చార్జీల పాలనతో ఇక్కట్లు..

బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఇన్‌చార్జీల పాలన కొనసాగుతోంది. ఇక్కడ పనిచేసిన ఈవో విజయరామారావు పది రోజుల క్రితమే నిజామాబాద్ జిల్లా సహాయ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు. ఇప్పటివరకు కొత్త ఈవోను నియమించలేదు. బదిలీపై వెళ్లిన విజయరామారావుకే ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. భద్రత సిబ్బంది నిర్లక్ష్యం వహించినా చర్యలు తీసుకోవడంలేదు. 28 మంది హోంగార్డుల్లో ఎవరు ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో కూడా అధికారులకు తెలియని పరిస్థితి ఉంది. ఏళ్లుగా పాతుకుపోయిన హోంగార్డులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. బాసర ఆలయంలో జరిగిన చోరీ ఘటనతో ఈ విషయం బయటపడింది. ఈనెల 15న బాసర ప్రధాన ఆలయంలో జరిగిన చోరీ ఘటనలో 2 గంటలపాటు దొంగ లోపల సంచరించినా ఎవరూ గుర్తించలేకపోయారు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డయినా పర్యవేక్షించేవారులేరు. ఆ రోజు రాత్రి 10.30 గంటలకు క్యూలైన్‌ల మీదుగా నడుచుకుంటూ వచ్చి గోశాల పైనుంచి ఆలయంలోకి దిగి దత్తాత్రేయ ఆలయం ముందు ఏర్పాటు చేసిన హుండీని పగులగొట్టినా ఇక్కడ ఉండే హోంగార్డులు ఆ విషయాన్ని గుర్తించలేకపోయారు. వేకువజామున 3గంటల సమయంలో ఆలయం లోపలకు వెళ్లిన హోంగార్డులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇదంతా గమనిస్తే భద్రత లోపం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఎస్పీ పర్యటనతో..

బాసర ప్రధాన ఆలయంలో బుధవారం రాత్రి చోరీ ఘటనపై ఎస్పీ జానకీషర్మిల శుక్రవారం ఆలయాన్ని సందర్శించారు. పోలీసులతో సమీక్షించారు. ఆలయ ప్రాంగణంలో భద్రతకు సరిపడా సీసీ కెమెరాలు లేవని, అవసరం మేరకు ఏర్పాటు చేయాలని సూచించారు. కెమెరాలను అనునిత్యం పర్యవేక్షించేందుకు ఇద్దరు ఉద్యోగులను నియమించాలని తెలిపారు. ఆలయంలో భద్రత లోపాలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేసిన ఆరుగురు హోంగార్డులను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు చెప్పారు. భద్రత విషయంలో బాసర ఆలయాన్ని తన అధీనంలోకి తీసుకుని నెలపాటు పర్యవేక్షిస్తామని ఎస్పీ తెలిపారు. మారుతున్న కాలనికి అనుగుణంగా పోలీసులు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భక్తులకు భరోసా కల్పించేలా భద్రత ఏర్పాట్లు ఉండాలని పేర్కొన్నారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థ పటిష్టం చేయాలని భక్తులు కోరుతున్నారు.

హోంగార్డులతోనే సరి...

బాసర ఆలయంలో 28 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రధాన ద్వారం, క్యూలైన్‌లు, అక్షరాభ్యాస మండపాల్లో హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. బాసర ఆలయంలోకి వెళ్లే ప్రాంతాల్లో మెటల్‌డిటెక్టర్లు ఎక్కడా కనిపించడంలేదు. భక్తులను నేరుగా ప్రధాన ఆలయంలోకి అనుమతిస్తున్నారు. నిత్యం వేలాదిమంది భక్తులు బాసర శ్రీజ్ఞానసరస్వతీ అమ్మవారిని దర్శించుకుంటారు. ఆలయ అవసరాలు, భక్తుల భద్రత విషయంలో పెద్ద సంఖ్యలోనే నియంత్రణ కోసం సిబ్బంది అవసరం ఉంటుంది. అయినా ఎక్కడ ఆ స్థాయిలో ఏర్పాట్లు లేవు. ఇక బాసర ఆలయంలో 32చోట్ల సీసీ కెమెరాలున్నాయి. కానీ.. వీటిని ఎవరూ పర్యవేక్షించడంలేదు. నిఘా వ్యవస్థ పటిష్టంగా లేక ఆలయంలోనూ చాలాచోట్ల అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో అధికారులూ ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు.

ఒకే పోలీస్‌స్టేషన్..


బాసర పోలీస్‌స్టేషన్

బాసర ఆలయం, మండలానికి ఒకే పోలీస్‌స్టేషన్ ఉంది. ఆలయ పరిసరాల్లోని ఈ పోలీస్‌స్టేషన్ నుంచే మండలంలోని అన్ని గ్రామాల భద్రతను పర్యవేక్షిస్తున్నారు. బాసర ఆలయానికి ప్రత్యేకంగా పోలీస్‌స్టేషన్ లేదు. ఇక్కడుండే అధికారులే అమ్మవారి ఆలయాన్ని, భద్రతను చూస్తారు. ప్రతీరోజు పెట్రోలింగ్‌లో ఉండే కానిస్టేబుళ్లు వెళ్లి ఆలయ ఆవరణలో విధులు నిర్వహించే హోంగార్డులను కలిసి పరిస్థితిని తెలుసుకుంటారు. బాసర రైల్వేస్టేషన్, గోదావరి స్నానఘట్టాలు, బాసర బస్టాండ్, ట్రిపుల్‌ఐటీతోపాటు మహారాష్ట్ర సరిహద్దులున్నాయి. వీటన్నింటిని బాసర పోలీసులే పర్యవేక్షిస్తున్నారు. బాసర ఆలయానికి ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు.

భద్రత చర్యలు చేపడుతున్నాం

బాసర ఆలయానికి వచ్చే భక్తులకు భద్రత కల్పించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉన్నాం. ఏ అవసరం వచ్చినా బాసర పోలీసులను సంప్రదించాలి. ఎక్కడ అనుమానితులు కనిపించినా మాకు సమాచారం ఇవ్వాలి. భక్తుల భద్రత విషయంలో రాజీ పడబోం. పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలు అందిస్తాం.

– గణేశ్, బాసర ఎస్సై

ఏజెన్సీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: ఏజెన్సీ ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో తమకు అన్యాయం జరుగుతోందని ఎస్జీటీలు కలెక్టర్ రాజర్షి షా దృష్టికి తీసుకెళ్లారు. శనివారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బేల మండలంలోని సైద్‌పూర్ స్కూల్ కాంప్లెక్స్‌కు సంబంధించి 18 వేకెన్సీలు ఉన్నప్పటికీ ఐదు ఖాళీలను మాత్రమే చూపించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శుక్రవారం అర్ధరాత్రి 12నుంచి శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకు మాత్రమే ఆన్‌లైన్ దరఖాస్తులకు అవకాశం ఇచ్చారని, మధ్యాహ్నం 12నుంచి 2గంటల వరకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారని తెలిపారు. దీంతో చాలామంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో బేల మండలంలోని సైద్‌పూర్ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఖాళీలన్నింటినీ చూపించాలని, తమకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసినవారిలో గంభీర్‌రావు, ప్రభాత్‌రావు, గణపతిరావు, రమేశ్, దామోదర్ తదితరులున్నారు.

రీలోకేషన్ గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ ఎఫ్‌ఆర్వోలు

కడెం: దూలపల్లి అటవీ శిక్షణ అకాడమీలో శిక్షణ పొందుతున్న అస్సాం రాష్ట్రానికి చెందిన 38 మంది ట్రైనీ ఎఫ్‌ఆర్వోలు శనివారం కడెం అటవీ రేంజ్‌లో పర్యటించారు. మండలంలోని రాంపూర్, మైసంపేట్ రీ లోకేషన్ కాలనీలో ఇండ్ల నిర్మాణాలు, వ్యవసాయ భూమి ని పరిశీలించారు. అనంతరం లక్ష్మీపూర్ బీట్ పరిధిలో బేస్ క్యాంపును సందర్శించారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణ కోసం తీసుకుంటున్న చర్యలను కడెం ఎఫ్‌ఆర్వో గీతారాణి ట్రైనీ ఎఫ్‌ఆర్వోలకు వివరించారు. అటవీ సిబ్బంది రవికుమార్ తదితరులున్నారు.

విధి నిర్వహణలో ఉత్సాహంగా సాగాలి



విజేతగా నిలిచిన ఖమ్మం వాలీబాల్ జట్టుకు ట్రోఫీ ఇస్తున్న అధికారులు



క్యారం ఈవెంట్‌లో విజేతగా నిలిచిన జాకీర్‌కు ట్రోఫీ ఇస్తున్న అధికారులు

ఆదిలాబాద్: విద్యుత్ ఉద్యోగులు క్రీడల్లో రాణించినట్లే విధి నిర్వహణలోనూ ఉత్సాహంగా సాగాలని ఆదిలాబాద్ విద్యుత్‌శాఖ ఎస్‌ఈ జేఆర్ చౌహాన్, నిర్మల్ ఎస్‌ఈ శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి వాలీబాల్, క్యారం పోటీలు శనివారం ముగిశాయి. విజేతలుగా నిలిచిన జట్లకు వారు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. నిత్యం విద్యుత్ సరఫరా విషయంలో బిజీబిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడల నిర్వహణ ఎంతో ఉత్సాహపూరిత వాతావరణాన్ని కలిగించిందని చెప్పారు. విద్యుత్‌శాఖలోనూ ఎంతో ప్రతిభగల క్రీడాకారులున్నారని, ప్రోత్సాహన్నిస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, సెక్రటరీ శ్రీనివాస్, అధికారులు జీవరత్నం, దేవాగౌడ్, హరికృష్ణ, నాగరాజు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వాలీబాల్ విజేతగా ఖమ్మం, రెండో స్థానంలో మహబూబ్‌నగర్, మూడో స్థానంలో ఆదిలాబాద్ నిలిచింది. ఇక క్యారం టీం ఈవెంట్లో విద్యుత్ సౌధ జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో నిజామాబాద్, మూడో స్థానంలో మెట్రోజోన్ హైదరాబాద్ జట్లు నిలిచాయి. ఓపెన్ సింగిల్స్‌లో జాకీర్ (మెట్రో జోన్, హైదరాబాద్) విజేతగా నిలిచాడు. ఓపెన్ డబుల్స్ ఈవెంట్లో మొదటి రెండు స్థానాల్లో మెట్రో జోన్ హైదరాబాద్ నిలువగా, మూడో స్థానంలో విద్యుత్ సౌధ జట్లు నిలిచాయి.

అటవీ ప్రాంతంపై హక్కులు కల్పించాలి


ఆర్డీవోను కలిసేందుకు వచ్చిన కొలాం గిరిజనులు

కైలాస్‌నగర్: తమ ప్రాంతాల్లోని అటవీ సంపదపై తమకే హక్కులు కల్పించాలని ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, సిరికొండ, తలమడుగు మండలాల్లోని పీవీటీజీ కొలాం గిరిజనులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్‌కు తరలివచ్చిన ఆయా మండలాల్లోని 24 గ్రామాలకు చెందిన కొలాం గిరిజనులు ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అడవినే నమ్ముకుని జీవించే తమపై అటవీశాఖ అధికారుల వేధింపులు అధికమయ్యాయని ఆరోపించారు. అడవిలోకి రానివ్వకపోగా, పోడు భూములను సాగు చేసుకోనివ్వడం లేదని వాపోయారు. తమకు అటవీ ప్రాంతాలపై హక్కులు కల్పిస్తే అడవిని కాపాడుకోవడంతో పాటు సంపదతో జీవనోపాధి పొందుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఆర్డీవోను కలిసిన వారిలో సెంటర్ ఫర్ కలెక్టివ్ డెవలప్‌మెంట్ ఎన్జీవో ప్రోగ్రాం మేనేజర్ కుమ్ర విఠల్‌రావు, గ్రామ పటేల్‌లు మడావి అనిల్, టేకం దిలీప్, కొడప రామారావు, చాకటి మహేందర్, జయవంత్‌రావు తదితరులున్నారు.

యాంటీ డ్రగ్, ర్యాగింగ్ అవగాహన కార్యక్రమంలో

ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



డ్రగ్స్ యాంటీ ర్యాగింగ్ పోస్టర్‌తో ఆర్జీయూకేటీ విద్యార్థులు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ

బాసర: తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన యాంటీ డ్రగ్, యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ఆరు నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ, డీజీపీ జితేందర్, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, సందీప్ శాండిల్య, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్రీదేవసేనతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ డ్రగ్స్ వాడకంతో కలిగే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. చాలామంది యువత సరదాగా మొదలుపెట్టిన ఈ అలవాటు వ్యసనంగా మారి భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి పదార్థాలు డ్రగ్స్ కిందకి వస్తాయి వాటికి విద్యార్థులు ఏ విధంగా ఆకర్షితులు అవుతారు అనే అంశాల గురించి వివరించారు. డ్రగ్స్ నియంత్రణకు విద్యార్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఇక కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్ కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో వివరించారు. విద్యార్థులందరూ తమ తోటి విద్యార్థులతో సోదరభావంతో మెలగాలన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డాక్టర్ కొత్తపల్లి రాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో పలు ఇళ్లలో చోరీ


చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్సై

ఖానాపూర్: పట్టణంలోని విద్యానగర్ కాలనీలోని పలు నివాసాల్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. విద్యానగర్‌లో నివాసముండే కాగజ్‌నగర్‌కు చెందిన జడల కుమారస్వామి ఇంటికి తాళం వేసి శుక్రవారం కాగజ్‌నగర్ వెళ్లాడు. ఇదేరోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలోని రూ.1.50లక్షల నగదు ఎత్తుకెళ్లారు. పక్కనే ఉన్న పెంబి మాజీ జెడ్పీటీసీ జానుబాయి ని వాసంలోకి చొరబడ్డ దొంగలు రూ.32వేల విలువైన కాళ్ల పట్టీలు దొంగిలించారు. స మీపంలోని మరో రెండు ఇళ్లలోనూ చోరీకి యత్నించినా విలువైన వస్తువులేమీ ఎత్తుకెళ్లలేదు. కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అనంతరం క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ప్రజలు ఇళ్లు వదిలి వేరే గ్రామాలకు వెళ్లేటప్పుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌తో పాటు సమీప నివాసాల వారికి సమాచారం ఇవ్వాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

భైంసాటౌన్: పట్టణంలోని పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేసి 12 మందిని అరెస్ట్ చేశారు. ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్ ఎదుట ఓ భవనంలో పేకాడుతున్నారన్న పక్కా సమాచారం మేరకు ఏఎస్పీ అవినాష్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీ చేయగా, 12 మంది పేకాడుతూ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.57,690 నగదు, 12 మొబైల్ ఫోన్లు, రెండు బైక్‌లు, కారు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీరిలో పలువురు బీజేపీ నాయకులు ఉండడం గమనార్హం.

రాష్ట్రస్థాయిలో జిల్లాకు పతకాల పంట


రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో పతకాల పంట పండించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం నిర్వహించిన పదో తెలంగాణ రాష్ట్ర సీనియర్ (పురుషులు, మహిళలు) అండర్ -23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్- 2024 పోటీల్లో పలు ఈవెంట్లలో విజేతలుగా నిలిచారు. పదివేల మీటర్ల ఈవెంట్లో రమేశ్‌కుమార్ గోల్డ్ మెడల్, స్టీపుల్ చేజ్ ఈవెంట్లో స్వాతి సిల్వర్, గౌరీ కాంస్యం సాధించారు. హ్యామర్ త్రోలో వీజీఎస్ రాకేశ్, అరుణ, ట్రిపుల్ జంప్‌లో సీహెచ్ వసంత కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మొత్తంగా ఏడు పతకాలు సాధించడంపై అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి, సెక్రటరీ రాజేశ్, పెటా అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, స్వామి అభినందనలు తెలిపారు.


గోమయం.. పర్యావరణహితం




గోమయ రాఖీలు

- నిర్మల్‌లో ప్రత్యేక రాఖీల విక్రయం

నిర్మల్‌ఖిల్లా: అందరిలాగే ప్లాస్టిక్ రాఖీ ధరించే కన్నా ఏదైన ప్రత్యేకత సంతరించుకునేలా ఉంటే బాగుంటుంది.. అదే రాఖీ ప్రకృతికి ఉపయోగపడుతుందంటే.. పర్యావరణానికి మేలు చేస్తుందంటే... మరింత బాగుంటుంది. అలాంటి రాఖీలనే తయారు చేసి విక్రయిస్తున్నాడు నిర్మల్ జిల్లా కేంద్రం సమీపంలోని శ్రీగాయత్రీ గోశాల నిర్వాహకుడు దోముడాల ప్రవీణ్‌శర్మ. అతడు తయారు చేసిన రాఖీలు మామూలుగా చూస్తే సాదాసీదాగానే కనిపిస్తాయి. కానీ, రాఖీ లోపల విత్తనం ఉంటుంది. పండుగ మరుసటి రోజు దాన్ని తీసి మట్టిలో వేసి నీరు పోస్తే మొక్కగా మొలకెత్తుతాయని ప్రవీణ్‌శర్మ చెబుతున్నాడు. జిల్లా కేంద్రంలోని స్థానిక బస్‌డిపో సమీపంలోని దక్షిణముఖి హనుమాన్ ఆలయం వద్ద గోవు పేడ, విత్తనాలను వినియోగించి వివిధ రకాల ఆకృతుల్లో తయారు చేసిన రాఖీలను విక్రయిస్తుండగా పలువురు కొనుగోలు చేయడం కనిపించింది.





రాఖీ.. వెరైటీ

- జిల్లాలో మొదలైన రక్షాబంధన్ సందడి
- రహదారుల వెంట వెలిసిన విక్రయ కేంద్రాలు
- కాలానికి అనుగుణంగా సరికొత్త రూపాల్లో లభ్యం







నిర్మల్‌టౌన్: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను సోమవారం జిల్లా వాసులు ఘనంగా జరుపుకోనున్నారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఇప్పటికే మార్కెట్లో, రహదారుల వెంట రాఖీ దుకాణాలు వెలిశాయి. సరికొత్త వెరైటీలతో కళకళలాడుతున్నాయి. దీంతో బస్టాండ్, స్వీట్ షాపులు, వివిధ దుకాణాలు రద్దీగా మారాయి.





ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

సరికొత్త వెరైటీగా ఉన్న రాఖీలను ముంబై, కోల్‌కతా, గుజరాత్, తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు చేపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ఓల్డ్, న్యూ బస్టాండ్, శివాజీ చౌక్, ఈద్గాం చౌరస్తా ప్రాంతాల్లో వెలిసిన రాఖీ సెంటర్ల లో పట్టణంతో పాటు ఆయా గ్రామాల ప్రజలు ఇక్కడికి వచ్చి విక్రయిస్తున్నారు. రంగురంగుల దారాలు, వివిధ రకాల పూసలు, వెండి, బంగారు పూతతో వివిధ ఆకృతుల్లో తయారుచేసిన రాఖీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. రూ.1 నుంచి మొదలుకొని రూ.వెయ్యి వరకు ధర పలుకుతున్నాయి. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా విభిన్న రాఖీలను విక్రయించేందుకు వ్యాపారస్తులు సిద్ధంగా ఉన్నారు. ఫ్యాన్సీ రాఖీలకు అధికంగా గిరాకీ ఉందని వ్యాపారాలు చెప్తున్నారు.

ఆర్టీసీ ద్వారా పంపండి

నిర్మల్ బస్టాండ్‌లో పట్టణ, పరిసర ప్రాంత ప్రజల సౌకర్యం కోసం ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రత్యేక రాఖీ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. దూరప్రాంతాల్లో ఉన్న అక్కాచెల్లెళ్లు ఆర్టీసీ లాజిస్టిక్ (కార్గో) ద్వారా రాఖీలు, స్వీట్లను తమ సోదరులకు అతితక్కువ ఖర్చుతో అతివేగంగా పంపించవచ్చు. ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

రద్దీగా బస్టాండ్

సోమవారం రాఖీ పౌర్ణమి, ఆదివారం సెలవుదినం కావడంతో పాఠశాలలు, కళాశాలలకు రెండు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో శనివారం సాయంత్రం విద్యార్థులు ఇంటిబాట పట్టడంతో బస్టాండ్లు రద్దీగా కనిపించాయి.

ఫ్యాన్సీ రాఖీలు ఇష్టపడుతున్నారు



ఫ్యాన్సీ రాఖీలను జనం ఎక్కువగా ఇష్టపడుతున్నారు. మా దగ్గర అతి తక్కువ ధరలకు, అత్యుత్తమ క్వాలిటీతో రాఖీలు అందుబాటులో ఉన్నాయి. రూ.1 నుంచి మొదలుకొని రూ వెయ్యి వరకు ధరలో మా షాపులో రాఖీలు అందుబాటులో ఉన్నాయి. న్యూ బస్టాండ్ సమీపంలో మా రాఖీ షాపును ఏర్పాటు చేశాం.

– సిద్ధు, రాఖీ దుకాణం యజమాని, నిర్మల్

క్లుప్తంగా

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అపరిశుభ్రతను చూపుతున్న వైద్యాధికారి

లోకేశ్వరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరి చేరవని జిల్లా ఇన్‌చార్జి వైద్యాధికారి రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలోని రికార్డులు, పరి సరాలను శనివారం పరిశీలించారు. అనంత రం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆవరణలోని పిచ్చి మొక్కలను సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ ఉ న్నందున వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆయనవెంట లోకేశ్వరం పీహెచ్‌సీ వైద్యురాలు తేజశ్విని, ఎంపీడీవో సోలమాన్‌రాజ్ ఉన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ

భైంసాటౌన్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో పరశురాం శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో రికార్డులు పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు తప్పనిసరిగా కళాశాలకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భూషణ్ పాండే, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

లక్ష్మణచాంద: గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మామడ, లక్ష్మణచాంద మండలాల పంచాయతీ కార్యదర్శులు, వైద్యశాఖ అధికారులతో శనివారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఇంటి పన్ను వంద శాతం వసూలు చేయాలన్నారు.ఇటీవల చేపట్టిన స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమం అమలు చేసిన తీరును కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌పీవో రమేశ్, ఎంపీడీవోలు రాధ, గంగసాగర్‌రెడ్డి, వైద్యురాలు ప్రత్యూష, ఎంపీవో అమీర్‌ఖాన్ పాల్గొన్నారు.

బడులకు స్వచ్ఛంద సంస్థలు చేయూతనివ్వాలి

కుంటాల: ప్రభుత్వ బడులకు స్వచ్ఛంద సంస్థల చేయూత అవసరమని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని అందకూర్ ప్రాథమిక పాఠశాలలో రూమ్ టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 1, 2 వికాసం పుస్తకాలను శనివారం అందజేసి మాట్లాడారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 15 వరకు నిర్వహించే రీడింగ్ క్యాంపెయిన్ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కుంటాల: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటారని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. కుంటాలలోని సెగ్రిగేషన్ షెడ్, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో ఎంఏ రహీం, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, హెచ్‌డబ్ల్యూవో నగేష్, తదితరులు ఉన్నారు.

బోరుకు మరమ్మతులు



బోరు వద్ద ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్

సాక్షి ఎఫెక్ట్..

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఆరో వార్డులో బోరు పనిచేయకపోవడంతో తాగునీటితో పాటు ఇతర అవసరాలు తీర్చుకునేందుకు కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులపై శనివారం 'బోరుకు మరమ్మతులు చేపట్టరూ' శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజశేఖర్ సిబ్బందిచే బోరుకు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

తెలియని వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

పెంబి: కేజీబీవీ పాఠశాల పరిసర ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఎస్సై శంకర్ తెలిపారు. శనివారం మందపల్లి కేజీబీవీ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల ఎస్‌వో వీణా, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

తానూరు: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. శనివారం జౌలా (బి) పాఠశాలలో పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనం చేసేముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

అధికారులు ప్రజల కోసం పనిచేయాలి

- ఎమ్మెల్యే రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావ్ పటేల్

కుభీర్: అధికారులు నాయకుల మెప్పుకోసం కాకుండా ప్రజలకోసం పనిచేయాలని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎవరైనా తప్పుడు పనులు చేయమంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యవసాయ అధికారి వికారొద్దీన్ మాట్లాడుతుండగా గందరగోళం చాలా మంది తమకు రుణమాఫీ జరగలేదని నిలదీశారు. అందుకు ఆయన సమాధానం చెబుతూ రూ.2లక్షల వరకే మాఫీ జరిగిందని, ఆపై ఉన్నవారు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. దుబాయ్, సౌదీ, హైదరాబాద్‌లో ఉంటున్న వారికి ఉపాధిహామీ డబ్బులు ఎలా వేశారని పలువురు ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌సింగ్, డీఈ తౌఫిక్, ఏఈ రాజన్న, ఏపీవో హరిలాల్, నాయకులు రాథోడ్ శంకర్, బి.విఠల్, వడ్నం నాగేశ్, పి.గంగాధర్, నాగేందర్, దత్తాత్రి, గంగాశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల లబ్ధిదారులకు శనివారం మండల కార్యాలయంలో ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ 37మందికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా సీఎం సహాయనిధికోసం ఎవరైనా తనవద్దకు రావచ్చన్నారు. సీఎం సహాయనిధి కోసం ఒక గదిని, కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.సోము, ఎంపీడీవో మోహన్‌సింగ్, నాయకులు బి.విఠల్, వడ్నం నాగేష్, పి.గంగాధర్, బోడిగాం గంగాశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదని రైతుల నిరసన



మామడలో మాట్లాడుతున్న బ్యాంకు జోనల్ మేనేజర్



కుభీర్‌లో నిరసన తెలుపుతున్న రైతులు

కుభీర్: మండలంలోని వివిధ గ్రామాల రైతులు తమకు రుణమాఫీ కాలేదని శనివారం మండల వ్యవసాయ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మూడు విడతల్లో కలిపి సగం మందికి కూడా మాఫీ చేయలేదని రైతు నాయకులు కందుర్ కనకయ్య అన్నారు. వ్యవసాయ అధికారి వికారొద్దీన్‌ను ప్రశ్నించగా రూ.2లక్షల వరకు మాఫీ అయ్యాయని, ఆపైన ఒక్కరూపాయి అధికంగా ఉన్నా మాఫీ జరగలేదన్నారు. రేషన్‌కార్డులు లేని రైతులు 72మంది ఉన్నారని చెప్పారు. తెలంగాణ బ్యాంక్‌లో 1,500 మంది రైతులు, యూనియన్ బ్యాంక్‌లో 2,700 మందికి, సహకార సంఘంలో 482 మందికి మాత్రమే మూడు విడతల్లో మాఫీ జరిగింది. రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందుతున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమన్న, నాయకులు జరుగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలని రైతుల ఆందోళన

మామడ: బ్యాంకులో తీసుకున్న వ్యవసాయ రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పొన్కల్ బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర ఎదుట శనివారం రైతులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం చేపడుతున్న రుణమాఫీ మూడు విడతలలో బ్యాంకు ఆఫ్ మహారాష్ట్రలో కేవలం 15 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ రావడంపై బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న బ్యాంకు జోనల్ మేనేజర్ అభిషేక్ బ్యాంకుకు వచ్చి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి 15రోజులలో సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలపడంతో రైతులు ఆందోళన విరమించారు.

యాంటీ డ్రగ్ కమిటీతో సమావేశం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని సహకార కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీతో శనివారం ఎస్సై సుమలత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతీ పాఠశాల, కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ భోజన్న, అధ్యాపకులు కిష్టయ్య, రాజేశ్వర్, శ్రీని వాస్, భోజన్న, స్వరాజ్యం పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనపై వెల్లువెత్తిన నిరసనలు



ఖానాపూర్: నివాళులు అర్పిస్తున్న వైద్యులు



కుంటాల: నిరసన తెలుపుతున్న ఆర్‌ఎంపీలు



లక్ష్మణచాంద:నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

ముధోల్: నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా మెడికల్ అసోషియేషన్ గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6గంటల నుండి ఆదివారం ఉదయం 6గంటల వరకు మండలంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఓపీ సేవలను నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఆర్‌ఐ నారాయణకు వినతి పత్రం అందజేశారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వైద్యురాలు ప్రత్యూష, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల: కుంటాలలో ప్రైవేట్ ఆస్పత్రులు బంద్ పాటించాయి. ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బస్టాండ్ ఆవరణలో గ్రామస్తులు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఆర్‌ఎంపీల సంఘం మండల కన్వీనర్ ఆర్ల ప్రవీణ్, ఉపాధ్యక్షులు సిందె సురేష్, సట్ల శ్రీనివాస్, సభ్యులు ఒడ్నం రమేశ్, వెంకట్ రావు, రాజురాయ్, వినోద్, మారుతి, బి.రవికుమార్, రమణ, భూషణ్, విజయ్, రవి, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

భైంసాటౌన్: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై హత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐఎంఏ భైంసా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఓపీ సేవలు నిలిపేసి నిరసన తెలిపారు. ముందుగా స్థానిక డాక్టర్ అసోసియేషన్ భవనం నుంచి ర్యాలీగా ఆర్డీవో కార్యాలయం చేరుకుని వినతిపత్రం అందజేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద బైఠాయించి ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు రాజేశ్వరరావు, కార్యదర్శి సూర్యకాంత్ రెడ్డి, డాక్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు డా దామోదర్ రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కాశీనాథ్, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, మెడికల్ నిర్వాహకులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి

ఖానాపూర్: రాత్రనకా పగలనకా విధులు నిర్వహిస్తున్న వైద్యఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని ఖానాపూర్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు డిప్యూటీ తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు.డాక్టర్ కిరణ్‌కుమార్, కేహెచ్ ఖాన్, విజయ్‌కుమార్, అనిల్‌బాబు, నాజియాఖానం, శివకుమార్, సౌమ్య, సుదర్శన్, నితీశ్, హరిచరణ్, దినేశ్, సాయికేతన్ పాల్గొన్నారు.


నర్సాపూర్(జి): గొల్లమాడలో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. నిందితులను కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లోకేశ్వరం : మండలంలోని కిష్టాపూర్, రాజూరలో ప్రధాన వీధులగుండా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



లక్ష్మణచాంద: రాఖీ కడుతున్న విద్యార్థినులు



దిలావర్‌పూర్: రాఖీ ఆకారంలో చిన్నారులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ద్రోణ పాఠశాలలో ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రాఖీలు కట్టారు. అనంతరం ఉపాధ్యాయులు రాఖీ పౌర్ణమి ప్రత్యేకత గూర్చి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సురేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు ముత్యం, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: రత్నాపూర్ కాండ్లీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఒకరికొకరు రాఖీ కట్టుకున్నారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సందేశాన్నిస్తూ పాఠశాలలో ఉన్న చెట్టుకు రాఖీ కట్టారు. ప్రధానోపాధ్యాయురాలు విజయ స్వప్న రాఖీ పౌర్ణమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు అనిత, రాజేశ్వర్, శ్యామల, వెన్నెల, గంగాధర్ ,అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సోన్: మండలంలోని కడ్తాల్, పాక్‌పట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్న త పాఠశాలలో శనివారం ముందస్తు రాఖీ వే డుకలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు వెంకన్న, రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వి ద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు విద్యార్థులకు రక్షాబంధన్ ప్రాముఖ్యత ను వివరించారు.

సారంగపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ముందస్తు రక్షాబంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాఖీలు కట్టారు. నేను నీకు రక్షా, నీవు నాకు రక్షా మనమందరం దేశానికి రక్షా అని చెబుతూ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కార్యకర్తలు నరేష్, బన్నీ, ఇర్ఫాన్, మైత్రేష్, వంశీ, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

బాసర: కిర్గుల్ (బి) గ్రామంలోని ప్రభుత్వ జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ముందస్తు రక్షా బంధన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నర్సారెడ్డి, ఉపాధ్యాయులు బి.నరేష్ , డి.రమేశ్, ఎన్.నరేష్, ఎం.సంతోష్, యోగేశ్వ్రావు దేశ్ముఖ్, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసారూరల్: మండలం దేగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య భారతి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్, ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్, ఉపాధ్యాయులు భాజరెడ్డి, రాజ్‌కుమార్, అజీమ్, గంగాధర్, భూమేశ్, పీఈటీ సురేఖ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ముందస్తు రాఖీ వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం బోనగిరి నరేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకుని రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

దిలావర్‌పూర్: సిర్గాపూర్‌లోని ప్లేర్ ఉన్నత పాఠశాలలో చిన్నారులు రాఖీ చిహ్నంగా ఏర్పడి అబ్బురపరిచారు. అనంతరం ఒకరికొకరు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ నరసంహారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఏవో బాధ్యతల స్వీకరణ

నర్సాపూర్(జి): నర్సాపూర్(జి) మండల వ్యవసాయాధికారిగా రాంచందర్ నాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో భైంసా మండల ఏవోగా పనిచేశారు. క్లస్టర్ ఏఈవోలు గణేశ్, భాగ్యలక్ష్మి, రమ్య శాలువాతో సత్కరించారు.

పుస్తె, మెట్టెలు అందజేత

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలోని నిరుపేద కుటుంబానికి చెందిన సిర్ర రాధ -శివశంకర్ దంపతుల కూతురు రేఖ వివాహానికి మాజీ మంత్రి ఐకేరెడ్డి పీఏ వొడ్డెపల్లి కృష్ణంరాజు చేయూతనిచ్చారు. బాధిత కుటుంబానికి రూ.8వేల విలువైన పుస్తె, మెట్టెలను అందజేశారు.

ఎమ్మెల్యే పర్సనల్ సెక్రెటరీగా 'మంగ్లారపు'

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పర్సనల్ సెక్రెటరీగా లక్ష్మణచాంద మండల వ్యవసాయాధికారి మంగ్లారపు ప్రవీణ్ కుమార్ నియామకమయ్యారు.

గీతాశక్తి పుస్తకావిష్కరణ

ముధోల్ : మండల కేంద్రం రబీంద్ర పాఠశాలలో శనివారం రెడ్ల బాలాజీ రచించిన గీతాశక్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. జాదవ్ పుండలీక్‌రావు, సామాజిక కార్యకర్త భోస్లే బాజీరావు, కవులు పీసర శ్రీనివాస్‌గౌడ్, బస్వరాజ్, కోల కృష్ణమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ సాయినాథ్ పాల్గొన్నారు.

శ్రమదానం

కుభీర్: మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తూ శనివారం అధికారులు శ్రమదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌సింగ్, ఏఈ రాజన్న, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఈవోకు సన్మానం

ముధోల్ : మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖలో ఏఈవోగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ప్రవీణ్‌ను శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ డైరెక్టర్ ధర్మపురి సుదర్శన్, మాజీ ఉప సర్పంచ్ సుభాష్, మాజీ ఎంపీటీసీ భూమేష్, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు తాటివార్ రమేశ్, వీడీసీ సభ్యులు పోతన్న, సాయినాథ్, శ్రావణ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పిన కారు

నర్సాపూర్(జి): మండలంలోని నసీరాబాద్ గ్రామ శివారు 61వ జాతీయ రహదారిపై శనివారం కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. కారులో నిర్మల్ నుండి మహారాష్ట్ర వెళ్తున్న ఓ కుటుంబం ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఉత్తమ ఉద్యోగికి సన్మానం

ముధోల్: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ ఏఎస్‌ఎంగా అవార్డు అందుకున్న ఏఎస్‌ఎం విజయను కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. కిషన్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, అజీజ్, దిగంబర్, ఖాలీద్, పటేల్, పోతారెడ్డి, అయాజ్ పాల్గొన్నారు.

అన్నాబావుసాఠే ఆశయసాధనకు కృషి చేయాలి

తానూరు: ప్రతి ఒక్కరూ సాహిత్యరత్న అన్నాబావు సాఠే ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు నాయకులు సూచించారు. శనివారం తానూరులో 'సాఠే' జయంతి వేడుకలు నిర్వహించారు. మాజీ సర్పంచులు తాడేవార్ విఠల్, మాధవ్‌రావ్ పటేల్, సోమ్‌నాథ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కకు పురుడు

లక్ష్మణచాంద: మండలంలోని మునిపెల్లిలో పెంపుడు కుక్కకు పురుడు పోశారు. గ్రామానికి చెందిన నర్సారెడ్డి పెంపుడు కుక్క మూడు రోజుల క్రితం నాలుగు పిల్లలకు జన్మనిచ్చింది. దీంతో శనివారం పురుడు పోశారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఖానాపూర్: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో రత్నాకర్‌రావు అన్నారు. మండలంలోని దాసునాయక్ తండాలో శనివారం వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరాన్ని సందర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు.

బంద్ విజయవంతం

భైంసాటౌన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు నిరసిస్తూ హిందూ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు శనివారం పట్టణంలో వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు బంద్ పాటించారు. దుకాణాలన్నీ మూసి ఉంచి సంఘీభావం తెలిపారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు బంద్ చేయించారు. హిందూ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ఖానాపూర్‌లో భారీ వర్షం

ఖానాపూర్: పట్టణంలో శనివారం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దీంతో స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని జీప్ అడ్డా చౌరస్తా వద్ద రోడ్డుపై వర్షపునీరు నిలిచి కుంటను తలపించింది. దీంతో కాసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.